నమస్తే తెలంగాణ
నిజామాబాద్, మంగళవారం 24 సెప్టెంబర్ 2024
TUESDAY, SEPTEMBER 24, 2024

27న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 23 : జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజనశాఖ అధికారి ముత్తెన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో జానపద నృత్యం, జానపద పాటలు, కథ, రచనలు, పెయింటింగ్, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9701177144, 9959649574 నంబర్లకు ఫోన్ చేయాలని లేదా సుభాష్‌నగర్‌లోని జిల్లా యువజన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 23 : నిజామాబాద్ నగరంలోని ఒకటో టౌన్, ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు పేకాట స్థావరాలపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఒకటో టౌన్ పరిధిలోని నాగేంద్రుడి గుడి పక్కన పేకాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.9,200 నగదు, 9 మొబైల్ ఫోన్లు, రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు వెల్లడించారు. ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాలోని సాయినగర్ కాలనీలో పేకాడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.11,390 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 23 : నగరంలోని డీ2 సెక్షన్ పరిధిలో నేడు (మంగళవారం) ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తోట రాజశేఖర్ తెలిపారు. రాష్ట్రపతి రోడ్డు, గాంధీచౌక్, హతాయి గల్లీ, హెడ్ పోస్టాఫీస్, నెహ్రూ పార్కు, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

విద్యార్థులను అభినందిస్తున్న సంస్థల ప్రతినిధులు

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 23 : జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్ పోటీలను సోమవారం నిర్వహించారు. జిల్లాలోని 13 ప్రభుత్వ పాఠశాలల్లోని 9, 10వ తరగతి విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీపై పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి (రూ.1000) జీహెచ్ఎస్ కోటగల్లీకి చెందిన చంద్రజ, శర్వాజ్, ద్వితీయ స్థానం (రూ.750) కుమార్‌గల్లీ జీహెచ్ఎస్‌కు చెందిన స్వాతి, కావేరి, తృతీయ స్థానం (రూ.500) బోధన్‌లోని విజయసాయికి చెందిన బూస్రా జవేరియాకు అందజేశారు. అదనపు జిల్లా వైద్యారోగ్య అధికారిణి దేవీ నాగేశ్వరి, జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ శైలిబెల్లాల్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్, ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, డీపీఎం సుధాకర్, జిల్లా సైన్స్ అధికారి కస్తూరి గంగాకిషన్, జిల్లా టీబీ కో-ఆర్డినేటర్ రవిగౌడ్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎస్ స్మారక క్రీడా పోటీలు ప్రారంభం

మార్చ్‌పాస్ట్‌లో మొదటిస్థానంలో నిలిచిన విజయ్ పాఠశాల విద్యార్థులు

జక్రాన్‌పల్లిలో విద్యార్థులకు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 23 : జిల్లా స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ ఆధ్వర్యంలో రాజ్యసభ మాజీ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ స్మారకార్థం పాత కలెక్టరేట్‌లోని డీఎస్ఏ మైదానంలో క్రీడాపోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మార్చ్‌పాస్ట్‌లో విజయ్ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులు 32 మంది బాలికలు పాల్గొని, మొదటిస్థానంలో నిలిచారని పాఠశాల కార్యదర్శి అమృతలత తెలిపారు. విద్యార్థులు రూ.5 వేల నగదుతోపాటు మెమెంటోను బహుమతిగా అందుకున్నారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

అంతర పాఠశాలల క్రీడాపోటీలు..

జక్రాన్‌పల్లి, సెప్టెంబర్ 23 : మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి అంతర పాఠశాలల క్రీడలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు ఆరోగ్యం, ఆహ్లాదకరమని.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలని సూచించారు. అంతకుముందు మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన డబుల్ రోడ్డుతోపాటు సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీడీవో సతీశ్‌కుమార్, క్రీడల కన్వీనర్ లింగన్న, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయారెడ్డి, సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మాజీ సర్పంచులు నర్సారెడ్డి, బాలకిషన్, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్చ్‌ఫాస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

అంతర పాఠశాలల క్రీడల్లో భాగంగా నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో మండలకేంద్రంలోని తేజస్ విద్యానికేతన్ ప్రథమ స్థానం, సిద్ధార్థ మోడల్ స్కూల్ (కలిగోట్) ద్వితీయ స్థానం, విద్యానికేతన్ (పడకల్) తృతీయ స్థానం సాధించారు. వీరికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి బహుమతులను అందజేశారు.

వర్ని ఏఎంసీ నియామకం

రుద్రూర్, సెప్టెంబర్ 23 : వర్ని ఏఎంసీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పాతవర్ని గ్రామానికి చెందిన కులకర్ణి సురేశ్, వైస్‌చైర్మన్‌గా కొత్మీర్‌కర్ లక్ష్మణ్‌తోపాటు సభ్యులుగా సంతోష్, పుల్లాజీ, రమేశ్‌గౌడ్, షేక్ అహ్మద్, వేములపల్లి సుధాకర్‌గావు, షేక్ మహబూబ్, ప్రవీణ్‌కుమార్, బట్టు నాగయ్య, నర్సడిగల్ల లావణ్య, వంగ సాయాగౌడ్, తల్లూరి మహేశ్ ఒరికె గంగాధర్ తదితరులను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఈ సందర్భంగా వర్ని మండలకేంద్రంలో నాయకులు పటాకులు కాల్చి సంబురాలు జరుకొన్నారు. నూతన కమిటీని సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

29న అర్చక సన్మాన మహోత్సవం

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 23 : జగిత్యాల జిల్లా కొండగట్టులో అర్చక సన్మాన మహోత్సవాన్ని ఈనెల 29న నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ వేదిక రాష్ట్ర ప్రతినిధి యుగేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వరంగల్, వేములవాడ, కొండగట్టు, జయశంకర్ భూపాలపల్లి, మంథని, ధర్మపురి, బాసర తదితర ఆలయాల ప్రధాన అర్చకులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని వివరించారు. బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 7382171021 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగాపలు పలు అంశాలపై వారు చర్చించారు.
– వినాయక్‌నగర్, సెప్టెంబర్ 23

పేదలకు దుప్పట్ల పంపిణీ

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 23 : నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో పేదలకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బదుప్పట్లు పంపిణీ చేశారు. భారత ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని 15 రోజుల పాటు నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం, ప్రభుత్వ దవాఖానలో అన్నదానం, పండ్ల పంపిణీ చేపట్టారు.

దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఆర్టీసీ లక్కీడ్రా

డ్రాలో గెలుపొందిన మహిళకు బహుమతిని అందజేస్తున్న డిపో మేనేజర్ ఆనంద్

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 23 : నిజామాబాద్ –వరంగల్ రూట్‌లో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు సంబంధించిన లక్కీడ్రాను జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో సోమవారం నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచి 16 తేదీ మధ్యలో ప్రయాణించిన ముగ్గురు మహిళలకు గిఫ్టులను డిపో మేనేజర్ ఆనంద్ అందజేశారు. ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జ్యోతి (మారంపల్లి), సావిత్రి (నిజామాబాద్), విజయలక్ష్మి (నిజామాబాద్) బహుమతులు గెలుచుకున్నారని తెలిపారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

అన్నప్రాసన చేస్తున్న సీడీపీవో జానకి

పోతంగల్, సెప్టెంబర్ 23 : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో జానకి సూచించారు. మండల కేంద్రంలో పోషణమాసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పోషక విలువలు ఉండే ఆకుకూరలు, పండ్లు తదితర పదార్థాలను ప్రదర్శించి, పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ కో-ఆర్డినేటర్ నరేశ్ గౌడ్, హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుమలత, మణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

రుద్రూర్, సెప్టెంబర్ 23 : మండలకేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ భవానీ – రుద్రూర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత దంత వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన 186 మంది విద్యార్థినులకు బోధన్ డెంటల్ కేర్‌కు చెందిన డాక్టర్ అబ్దుల్ రజాక్ దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. పేస్టులు, మందులు అందజేసి, దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ అధ్యక్షుడు కేవీ మోహన్, సభ్యులు శ్యామ్‌సుందర్ పహాడే, రమేశ్, తాహేర్,లయన్స్‌క్లబ్ ఆఫ్ భవానీ అధ్యక్షుడు రవీంద్రబాబు, హెచ్ఎం శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **గోవూర్‌లో బీటీ రోడ్డు నిర్మించాలి -** మోస్రా (చందూర్), సెప్టెంబర్ 23 : మోస్రా మండలంలోని గోవూర్‌లో సీపీఎం మహాసభను సోమవారం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకురాలు గంగవ్వ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గోవూర్ బస్టాండ్ నుంచి జీపీ వరకు బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని తీర్మానం చేశారు. పార్టీ గ్రామ కార్యదర్శిగా బొర్ర గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ తెలిపారు.
- **ఘనంగా ఊరపండుగ -** ఇందల్వాయి, సెప్టెంబర్ 23 : మండలకేంద్రంలో సోమవారం కూడా ఊరపండుగ కొనసాగింది. గ్రామదేవతల ఊరేగింపు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. యాటలను బలి ఇచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామస్తులు వనభోజనాలకు తరలివెళ్లారు.
- **శిశువుల్లో లోపాలను గుర్తించాలి -** ఇందల్వాయి, సెప్టెంబర్ 23 : శిశువుల్లో ఉన్న లోపాలను గుర్తించాలని అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు అన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఇంటింటికీ తిరుగుతూ అవగాహన అవగాహన కల్పించారు. పుట్టుకతో లోపాలు ఉంటే ట్రీట్‌మెంట్‌తో సమస్యలను దూరం చేయవచ్చని సూచించారు.
- **నీటి సరఫరా సహాయకులకు శిక్షణ -** ఎంపీడీవో మీటింగ్‌హాలులో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నీటి సరఫరా సహాయకులకు శిక్షణ తరగతులను శిక్షణ తరగతులను సోమవారం నిర్వహించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఈ నెల 26వ తేదీ వరకు శిక్షణ కొనసాగనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈఈ మున్నీ, ఎంపీవో చందర్, ఏఈ ధన్‌రాజ్ పాల్గొన్నారు.
- **ఏఎంసీ పాలకవర్గానికి సన్మానం -** కోటగిరి, సెప్టెంబర్ 23 : మండలకేంద్రంలో ఏఎంసీ నూతన పాలకవర్గాన్ని ఎమ్మార్పీఎస్ నాయకుడు పోచీరాం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. చైర్మన్ హన్మంతు, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ కులకర్ణితోపాటు సభ్యులను సన్మానించారు. విండో చైర్మన్ సిద్ధు, రాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.
- **దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి -** ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 23 : దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు ఆలోచించి, ఈ చట్టం కోసం ముందుకు రావాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో నాయకులు పి. సుధాకర్, వై.రాజిరెడ్డి, పి.నరిగరావు, హన్మాండ్లు పాల్గొన్నారు.
- **ఆలయ భూమి కబ్జాకాకుండా చూడాలి -** ధర్పల్లి, సెప్టెంబర్ 23 : మండల కేంద్రంలోని భీమ్‌గల్ రోడ్డులో మలగుట్ట శ్రీజగన్నాథ ఆలయానికి సంబంధించిన భూమి కబ్జాకాకుండా చూడాలని వీడీసీ సభ్యులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ మాలతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. జగన్నాథ ఆలయానికి సంబంధించిన భూమికి సర్వే చేపట్టి, కబ్జాలను తొలగించాలని కోరారు.
- **పెస్టిసైడ్ డీలర్లకు అవగాహన సదస్సు -** డిచ్‌పల్లి, సెప్టెంబర్ 23 : మండలంలోని నడ్పల్లి రైతువేదికలో రూరల్ సహాయ వ్యవసాయ సంచాలకుల ఆధ్వర్యంలో పెస్టిసైడ్స్ డీలర్లకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహిచారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఉధృతంగా ఉన్న సుడిదోమ, బ్యాక్టీరియా, ఎండాకు తెగులు, అగ్గితెగులు, కంకినల్లి తదితర వాటికి ఏయే మందులు ఎంత మోతాదులో వాడాలని సిఫారసు చేస్తూ అవగాహన కల్పించారు. సదస్సులో రూరల్ డివిజన్ మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.
- **నేడు అపరాల సాగుపై అవగాహన -** ధర్పల్లి, సెప్టెంబర్ 23 : మండలంలోని ప్రాజెక్టు రామడుగు గ్రామంలో ఉన్న రైతువేదికలో నేడు (మంగళవారం) రబీ పంటలు – అపరాల సాగుపై హైదరాబాద్ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పిస్తారని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్ సోమవారం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
- **'మూకుమ్మడిగా డైరెక్టర్ల రాజీనామా అవాస్తవం' -** డిచ్‌పల్లి, సెప్టెంబర్ 23 : మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈనెల 20న ఖిల్లా డిచ్‌పల్లి విండో చైర్మన్‌పై అవిశ్వాసం అన్న వార్తపై వారు స్పందించారు. మూకుమ్మడిగా డైరెక్టర్ల రాజీనామా, విండో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి యత్నం వార్త అవాస్తవమని విండో డైరెక్టర్లు స్పష్టంచేశారు. సహకార సంఘం అభివృద్ధి కోసమే డీసీవోను కలిసినట్లు తెలిపారు. వైస్‌చైర్మన్ కుమ్మరి చిన్నగంగారాం, సతీశ్‌రెడ్డి, శాంసన్, రాము, హరిచంద్, చిన్ననర్సింహులు, బాలమల్లు, సాయిలు పాల్గొన్నారు.
- **విద్యార్థులకు బహుమతులు-** నందిపేట్, సెప్టెంబర్ 23: మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల జూడో పోటీల్లో ఒకరు ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారని, ఇద్దరు ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారని పాఠశాల కరస్పాండెంట్ అరుణ్ తెలిపారు.
- **రోడ్లపై పంటలు ఆరబెట్టొద్దు –**మోర్తాడ్, సెప్టెంబర్ 23: రోడ్లపైన పంటల నూర్పిడిలు చేయవద్దని, రోడ్లపై ఆరబెట్టవద్దని ఎస్సై విక్రమ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పంటలను రోడ్లపై ఆరబెట్టడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, అదే విధంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఈవిషయాన్ని రైతులు గమనించాలని చెప్పారు. ముఖ్యంగా రాత్రుల్లో వాహనాలపై వెళ్తున్న వారు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు.
- **నేడు మెగా రక్తదానం శిబిరం-** ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్23: మామిడిపల్లి శివారులోని మున్నూరు కాపు సంఘ భవనంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహానాయుడు తెలిపారు. పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్య అతిథిగా ఆర్మూర్ ఎమ్మెల్యే హాజరవుతారని అన్నారు.
- **పరిశుభ్రత పాటించాలి-** ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్23: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మామిడిపల్లి ఆరోగ్య ఉప కేంద్రం వైద్య సిబ్బంది సూచించారు. సోమవారం పలు కాలనీల్లో ఇంటింటికీ తిరిగి సిహెచ్‌వో గిరిబాబు అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు మోహన్, జగ్జీవన్, గజన్‌లాల్, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు అభినందన
బినోలా పాఠశాల ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి అంతర్ పాఠశాల క్రీడా పోటీల్లో నాళేశ్వర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తొమ్మిది బహుమతులను గెలుచుకున్నారు. వారిని సోమవారం వీడీసీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. పాఠశాలలో విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సంతోష్‌ను అభినందించారు. – నవీపేట, సెప్టెంబర్ 23

ఆర్మూర్‌లోని రాంమందిర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఆర్మూర్ అర్బన్, ఆర్మూర్ మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో ప్రతిభ చూపగా వారిని సోమవారం ఉపాధ్యాయులు అభినందించారు. జూనియర్ కబడ్డీ విభాగంలో ప్రథమ బహుమతి, జూనియర్ వాలీబాల్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించినట్లు పాఠశాల హెచ్ఎం చలం తెలిపారు. ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 23

నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్ స్మారకార్థం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో మాక్లూర్ మండలం కల్లడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు పీడీ సురేందర్ తెలిపారు. సోమవారం నిర్వహించిన మార్చ్‌పాస్ట్ కార్యక్రమంలో కల్లడి టీం ప్రథమ స్థానంలో నిలిచి నిర్వాహకుల చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. హెచ్ఎం నాగరాజు, గ్రామస్తులు విద్యార్థులను, పీడీని అభినందించారు. – మాక్లూర్, సెప్టెంబర్23

కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. సీఎం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. – ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్23

యంచలో వంజరి సాయిబాబా ఇంట్లో కోడి ఏడు పిల్లలకు జన్మనివ్వగా వాటిలో ఒక పిల్లకు నాలుగు కాళ్లు ఉన్నాయి. దీంతో దానిని చూసేందుకు ప్రజలు తరలి వచ్చారు. – నవీపేట, సెప్టెంబర్ 23

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★అనఘా షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్ (M/F) Sal:15000/- అనుభవం గల ఎలక్ట్రీషియన్ (డిప్లొమా ఎలక్ట్రీషియన్) Sal:15000/- month మరియు సెక్యూరిటీ గార్డ్స్ (M/F) Sal:12000/- month కావలెను. ఆసక్తి గలవారు వెంటనే I.D. ప్రూఫ్, ఫోటోతో సంప్రదించండి. అనఘా షాపింగ్ మాల్, R.P రోడ్, నిజామాబాద్
NTZ-334461

వెంటనే కావలెను
★వ్యవసాయరంగంలో అనుభవం మరియు డ్రోన్ స్ప్రే యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించి ఒప్పించగలిగే నైపుణ్యం కలిగిన ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ప్రదేశం: సంగారెడ్డి, కామారెడ్డి, సం|| సెల్: 9032527297
NTZ-334401

వెంటనే కావలెను
★Small/Medium తరహా DGCA సర్టిఫికేట్ కలిగి ఉండి 1 సంవత్సర అనుభవం కలిగిన అగ్రిడ్రోన్ పైలట్ కావలెను. విద్యార్హత ఇంటర్మీడియట్ / డిగ్రీ కలిగినవారు సంప్రదించండి సెల్: 9032527297
NTZ-334402

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఒకటి నాటికి టీచర్ల సర్దుబాటుకు చర్యలు

- డీఈవో దుర్గప్రసాద్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

రెంజల్,సెప్టెంబర్ 23: 'ముందుకు సాగని పాఠాలు' శీర్షికన నమస్తేతెలంగాణ దిన పత్రికలో సోమవారం ప్రచురితమైన కథనంపై డీఈవో దుర్గాప్రసాద్ స్పందించారు. ఆయన నమస్తే తెలంగాణతో ఫోన్‌లో మాట్లాడారు. వచ్చేనెల ఒకటి నాటికి జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దు బాటు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్ అన్నారు. కందకుర్తి ఉర్దూ మీడియం పాఠశాలకు నవీపేట మండలం నుంచి ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై వచ్చేలా ఉత్తర్వులు జారీ చేస్తానని అన్నారు. ఉపాధ్యాయుల కొరతను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిగులు టీచర్లను ఇతర బడుల్లో సర్దుబాటు చేసేందుకు మార్గదర్శకాలను సిద్ధం చేస్తామని అన్నారు. కొన్ని స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయిందని, మరి కొన్ని పాఠశాలల్లో పెరిగిందని అన్నారు. విద్యార్థులు ఉన్న చోట టీచర్లు లేక పోవడం, టీచర్లు ఉన్న చోట విద్యార్థులులేని పరిస్థితి కొన్ని పాఠశాలల్లో నెలకొన్నదని పేర్కొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన

ఏర్గట్ల, సెప్టెంబర్ 23: మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న సీసీ రోడ్డుపై కల్వర్టు ఏర్పాటు పనులను స్థానిక పంచాయతీ కార్యదర్శి జాకీర్‌తో కలిసి ఎంపీవో శివచరణ్ సోమవారం పరిశీలించారు. ఎంపీవో మాట్లాడుతూ.. రోడ్డుకు ఒక వైపు మురికి నీరు నిలిచి పోవడంతో ప్రజలకు ఇబ్బందిగా మారిందని, దీంతో సిమెంట్ పైపులు వేసి కల్వర్టు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇప్పించాలి

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 23: 60 ఏండ్లు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వీఆర్‌ఏల వారసుల సంఘం బోధన్ డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్ కోరారు. సోమవారం బోధన్ పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 20 వేల మందికి పైగా వీఆర్‌ఏలు ఉండగా, అందులో 16వేల మంది వీఆర్‌ఏల వారసులకు జీవో 81, 85 ప్రకారం ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవోలను తక్షణమే జాప్యం లేకుండా అమలు చేయాలని కోరారు. సమావేశంలో బోధన్ డివిజన్‌లోని వివిధ మండలాల అధ్యక్షులు రత్నాకర్, రాజు, శివ, మన్సూర్, లక్ష్మణ్, శ్రీను, హన్మాండ్లు, నర్సింలు, హన్మంతు, పర్వయ్య, గోపి, సాయికుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **వరి పంటల పరిశీలన -** బోధన్ రూరల్/నవీపేట, సెప్టెంబర్ 23: బోధన్ మండలంలోని పెంటకుర్దు క్యాంప్, సాలూరా మండలంలోని కుమ్మన్‌పల్లి, సాలంపాడ్ క్యాంప్ గ్రామాల్లోని వరి పంటలను సోమవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. తెగుళ్ల నివారణకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఏఈవో సాయిచరన్, రైతులు పాల్గొన్నారు. నవీపేట మండలంలోని జన్నేపల్లి శివారులో తెగుళ్లు సోకిన పంటలను ఏవో నవీన్‌కుమార్ పరిశీలించారు.
- **పసుపు పంట.. -** ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్23: ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్‌లో సోమవారం పసుపు పంటను కమ్మర్‌పల్లి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త మహేందర్‌తోపాటు వ్యవసాయ శాఖ అధికారి సంధ్యారాణి పరిశీలించారు. చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.
- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలి-** భీమ్‌గల్, సెప్టెంబర్ 23: టీటీడీలో లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం మండల కేంద్రంలో హిందూ సంఘాల నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హరి రవీందర్, యోగేశ్వర్, నర్సయ్య, తోట ఈశ్వర్, గంగాధర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.
- **పీడీఎస్‌యూ 'స్వర్ణోత్సవ' ర్యాలీ -** ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్23: పీడీఎస్‌యూ ఏర్పడి 50 ఏండ్ల పూర్తయిన సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో స్వర్ణోత్సవ ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో స్వర్ణోత్సవ సభ నిర్వహించనున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ తెలిపారు. సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.
- **బస్సు డిపోను ప్రారంభించాలి-** నందిపేట్, సెప్టెంబర్ 23 : మండల కేంద్రంలో బస్సు డిపోను ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. బస్సు డిపో కోసం గతంలో గ్రామస్తులు చందాలు వసూలు చేసి డబ్బులతో డిపో స్థలం కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పుజెప్పామన్నారు. కార్యక్రమంలో దేవన్న, మల్లయ్య, రాజలింగం, అనంతరావు, జువ్వన్న పాల్గొన్నారు.
- **వరి మద్దతు ధర రూ.3500 ప్రకటించాలి-** ఎడపల్లి, సెప్టెంబర్ 23: కేంద్రం ప్రభుత్వం వరికి రూ.3500 మద్దతు ధర ప్రకటించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ కోరారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ కె.దన్వాల్‌కు వినతి పత్రం అందజేశారు. వరి కోతకు వచ్చినందున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీపతి మల్లేశ్, సుదర్శన్, హనుమాన్ పాల్గొన్నారు.
- **గురుకుల కళాశాలలో వలంటీర్ల శ్రమదానం-** మాక్లూర్, సెప్టెంబర్ 23 : దాస్‌నగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ధాత్రిక వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కళాశాల ఆవరణలోని ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను తొలగించారు. దాస్‌నగర్‌లో ఇంటింటికీ తిరిగి ప్లాస్టిక్ వాడకడంతో వచ్చే అనర్థాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం.సరిత, అధ్యాపకులు శ్వేత, సుమలత, వలంటీర్లు పాల్గొన్నారు.
- **సబ్ కలెక్టర్‌కు సన్మానం-** బోధన్, సెప్టెంబర్ 23: బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోను సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంకు సంధ్యదాము, వైస్ చైర్మన్ చీల శంకర్, డైరెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు.
- **ఇంటింటా ఆరోగ్య సర్వే -** నందిపేట్, సెప్టెంబర్ 23 : మండంలోని వెల్మల్ గ్రామంలో అహ్మది బేగం అనే బాలికకు డెంగ్యూ వ్యాధి రావడంతో సోమవారం డాక్టర్ ప్రవీణ్, జీపీ సెక్రెటరీ రంజిత్ ఆధ్వర్యంలో జీపీ సిబ్బంది మందులు స్ప్రే చేయించారు. ఇంటింటికి సర్వే చేశారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి కుర్చీల వితరణ

బాల్కొండ, సెప్టెంబర్ 23: కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థి ఆర్. రామకృష్ణ కుర్చీలను సోమవారం వితరణ చేశారు. కంప్యూటర్ల వద్ద కుర్చీలు లేకపోవడంతో విద్యార్థుల సమస్యను తెలుసుకుని 20 కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతుల్లో బోధించాలి

నవీపేట, సెప్టెంబర్ 23: విద్యార్థులకు శాస్త్రీయ పద్ధతుల్లో బోధించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు విజయనందరావు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో లిటిల్ ఫ్లవర్‌తోపాటు బాలుర, బాలికల పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఫిజియోథెరపీపై అవగాహన

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్23: స్థానిక ఎంఈవో కార్యాలయంలో సోమవారం హైదరాబాద్ నిమ్స్ దవాఖాన ఫిజియోథెరపీ వింగ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫిజియోథెరపిస్టులు మహేశ్ కుమార్, వెంకటరమణ పలు రకాల ఫిజియోథెరపీ ప్రక్రియలు, శరీరానికి కావాల్సిన బలవర్ధక ఆహారంపై వివరించారు.

చర్యలు తీసుకోవాలి

భీమ్‌గల్, సెప్టెంబర్ 23: తాగునీటి బావిని కూల్చివేయడంతోపాటు అక్రమంగా ప్రహరీ నిర్మించి చర్చి నడుపుతున్న పాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని భీమ్‌గల్ మాల సంఘం సభ్యులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశారు. కులసంఘం సభ్యులను తీవ్రమైన పదజాలంతో దూషిస్తున్న పాస్టర్‌పై చర్యలు తీసుకుని, అనుమతి లేకుండా నడుస్తున్న చర్చిని మూసివేయాలని, ప్రహరీ తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

నవీపేట, సెప్టెంబర్ 23: మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం అబ్బాపూర్(ఎం) గ్రామానికి చెందిన గైని రుక్మవ్వ(64)కు చెందిన ఇంటిపై ఈనెల 20న కోతులు దూకడంతో విద్యుత్ వైర్ తెగి పోయింది. ఆ వైర్‌ను తాకిన వృద్ధురాలు విద్యుదాఘాతంలో తీవ్ర గాయాల పాలైంది. కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడు పద్మారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.